అంజిరెడ్డి ఆస్పత్రిలో వడ్లమూడివారి పాలెం వాసికి పునర్జన్మ



హాస్పిటల్‌లో పేషెంట్‌తో డాక్టర్లు శ్రీనివాసరెడ్డి, శబరిగిరీష్

నరసరావుపేట: తీవ్రమైన హైబీపీ, కిడ్నీ సమస్యతో గుండెనొప్పికి గురైన వ్యక్తికి జిల్లాలో తొలిసారిగా బైరినల్ ఆర్టరీ స్టంటింగ్ ఆపరేషన్ చేసి పునర్జన్మ ప్రసాదించినట్లు డాక్టర్ అంజిరెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కార్డియాలజిస్టు డాక్టర్ కోట శబరిగిరీష్ పేర్కొన్నారు. మంగళవారం హాస్పిటల్ ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. మంగళగిరి మండలం వడ్లమూడి వారిపాలెం గ్రామానికి చెందిన సాయికృష్ణ రాజ్‌కి తీవ్రమైన హైబీపీ (నిమిషానికి గుండె 240 సార్లు కొట్టుకోవడం), కిడ్నీ సమస్యతో బాధపడుతూ అనేక ప్రైవేటు హాస్పిటల్ చుట్టూ తిరిగి చనిపోతానని తెలిసి ఇంట్లోనే ఉన్నారన్నారు. అప్పుడు బంధువుల సమాచారం మేరకు నరసరావుపేటలోని తమ హాస్పిటల్‌లోని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కోట శబరిగిరీష్‌ను సంప్రదించారన్నారు. ఆ పేషెంట్‌కు కొన్ని రక్త పరీక్షలు చేసి కిడ్నీల ఇరువైపులా బ్లాకులు ఉన్నందున గుండెపై ఒత్తిడి పడటంతో రక్తపు సరఫరా ఎక్కువగా జరగటం మూలాన గుండె ఎక్కువగా కొట్టుకుంటోందని గ్రహించారన్నారు. ముందుగా కిడ్నీలకు స్టంట్లు అమర్చే బైరినల్ ఆర్టరీ స్టంటింగ్ అనే అత్యాధునిక పద్ధతి ద్వారా కిడ్నీ ఇరువైపులా స్టంట్లు అమర్చి రక్త సరఫరాని సాధారణ స్థితికి తీసుకురావటం జరిగిందన్నారు. దీంతో గుండె కొట్టుకోవటం సాధారణ స్థితికి వచ్చిందన్నారు. ఇటువంటి అరుదైన, క్లిష్టమైన ఆపరేషన్ తొలిసారిగా జిల్లాలోని తమ హాస్పిటల్‌లో చేయటం ఎంతో సంతోషకరమని డాక్టర్ కోటా శబరిగిరీష్ అన్నారు. డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ వైద్య సేవలను పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పేషెంట్ మాట్లాడుతూ తనకు పునర్జన్మ ఇచ్చిన డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ వైద్యులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

బాలల హక్కులకై సమన్వయం కావాలి

ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి



యడ్లపాడులో మాట్లాడుతున్న పద్మావతి

యడ్లపాడు: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిజ్ఞకరూ కృషి చేయాలని..అందుకు అన్నిశాఖలు సమన్వయం చేసుకోవాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడు జెడ్పీహైస్కూల్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవో జి.శాంతకుమారి, హైస్కూల్ హెచ్‌ఎం జి.విజయ భారతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

బడిబయట పిల్లలు ఉంచొద్దు..

చిలకలూరిపేటటౌన్: మండలంలోని బొప్పూడి, రాజాపేట గ్రామాలలో ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి మంగళవారం పర్యటించారు. బొప్పూడి గ్రామంలోని ఎస్టీ కాలనీలో పర్యటించి బడిబయట ఉన్న 25 మంది పిల్లలను గుర్తించారు. వారి తల్లిదండ్రులను కలిసి వివరాలను తెలుసుకున్నారు. ఆమెతో పాటు ఎంఈవో కె.లక్ష్మి, సీడీపీవో జి.శాంతకుమారి, రెసిడెన్షియల్ స్కూల్ ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉల్లాస్ విజయవంతం చేయండి

శావల్యాపురం: స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులు అక్షరాస్యులను చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల వెలుగు కార్యాలయంలో వీవోఎలకు ఉల్లాస్, పుస్తక నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడతూ ఈనెల 18 న పింఛన్లు వెరిఫికేషన్ తనిఖీ జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు అందరు అక్షరాస్యులుగా తయారు చేయటానికి ఉల్లాస్ పుస్తకాలను వినియోగించాలన్నారు.

ఛీ... ఇదో 'చెత్త' పాలన!



నరసరావుపేట రూరల్ : ములకలూరులో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. గ్రామంలో ప్రతి రోజు ఇంటింటికి వచ్చి పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను సేకరిస్తారు. గత 20 రోజులుగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిలిపివేశారు. దీంతో వ్యర్థపదార్థాలను ఇంటి బయటే వేయాల్సి వస్తుందని మసీదు సెంటర్‌లో మహిళలు తెలిపారు. మంగళవారం వ్యర్థాలతో నిండిన డస్ట్‌బిన్‌లతో మహిళలు నిరసన తెలిపారు. ఇప్పటికే పలుమార్లు దీనిపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌ఈసీలో సంక్రాంతి సంబరాలు

నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వెలిగించి సంబరాలను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులతో పోటీలకు హాజరయ్యారు. రంగోలి పోటీలో విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హరిదాసుల పాటలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, నిట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హరికృష్ణ, నిప్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.సురేష్‌కుమార్, వ్యాయామ అధ్యాపకుడు ఎల్.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11న స్కాలర్ షిప్‌ల పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వినుకొండ శాఖ ఆధ్వర్యంలో వెనుకబడిన కాపు విద్యార్థులకు స్కాలర్ షిప్ పంపిణీ కార్యక్రమాన్ని పట్టణంలోని వై-కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రెసిడెంట్ ఆర్.జె. రమేష్ తెలిపారు. 10వ తరగతిలో 500కు పైగా మార్కులు, ఇంటర్‌లో 900లకు పైగా మార్కులు, జేఈఈ, నీట్‌లో సీటు సాధించిన వారు, ఎంసెట్‌లో 5 వేలు లోపు ర్యాంక్ సాధించిన కాపు విద్యార్థులు అర్హులన్నారు.

డయల్ యువర్ డీఎంను సద్వినియోగం చేసుకోండి

వినుకొండ(నూజెండ్ల): ఆర్టీసీ డిపోలో బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం జె.నాగేశ్వరరావు తెలిపారు. డిపో పరిధిలోని పట్టణం, గ్రామాల నుంచి సమయాల వేళల్లో మార్పులు, సర్వీసులకు సంబంధించి సమస్యలు, సలహాలు, సూచనలు 9959225431కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే సంక్రాంతి పండుగ సందర్భంగా వినుకొండ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డీఎం జె.నాగేశ్వరరావు తెలిపారు. జనవరి 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. అంతేకాకుండా జనవరి 10 నుంచి వినుకొండ హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా నడుస్తాయన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



నరసరావుపేటటౌన్: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాష్ నగర్ సిరి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే ఏలూరి భాగ్యలక్ష్మి (80) రెండు రోజుల క్రితం ఇంట్లో పూజ చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆమెను కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

9న ఉత్తమ రైతు అవార్డు సంక్రాంతి సంబరాలు

శావల్యాపురం: స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈనెల 9న అభ్యుదయ రైతులకు పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమం జరుగుతుందని కరస్పాండెంట్ కనగాల వెంకట రామ మోహన్‌చందు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వ్యవసాయాన్ని పండగలాగా చేసుకునే ఉత్తమ రైతులకు పురస్కారాలతో పండుగ విశిష్టత ప్రదర్శనలు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ రైతు పురస్కారం అవార్డు గ్రహీతలు కామినేని వెంకటేశ్వర్లు (శావల్యాపురం) దివ్వకోలు శ్రీనివాసరావు (కొత్తలూరు) దుగ్గెంపూడి చిన వెంకయ్య (పిచికలపాలెం) ముండ్రు వెంకట్రావు (మతుకుమల్లి) కాల్వ సుందరరావు (మతుకుమల్లి) గడుపూడి నాగేశ్వరరావు (చినకంచర్ల) అప్పలనేని వీరాంజనేయులు (కారుమంచి) యలవర్తి మహేష్ (వేల్పూరు) అందరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రిన్సిపాల్ గోళ్ళమూడి రత్నకుమారి, అజిత్‌చందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో ఛత్రపతి శివాజీ వాలీబాల్ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాల్గొనదలచిన టీంలు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా తమ ఎంట్రీలను నమోదు చేసుకోవాలన్నారు. అదే రోజు డ్రా కూడా తీస్తామన్నారు. వివరాలకు ఎస్.రాజు 9666957097, సి.హెచ్.నాగరాజు 6303255154 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఫసల్ బీమా నమోదుకు ఆఖరి అవకాశం

నాదెండ్ల: రబీలో వరిసాగు చేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో నమోదు చేసుకునేందుకు ఈ నెల 15 వరకూ అవకాశం ఉందని నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ చెప్పారు. అప్పాపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివకుమారి, స్థానిక ఏవో హరిప్రసాద్, ఫ్యూచర్ జనరల్ కంపెనీ జిల్లా మేనేజర్ లింగయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నెల్లూరి హరిబాబు, వీఏవో జీవన్‌నాయక్, ఉద్యానవనశాఖ సహాయకులు నాగరత్నకుమార్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నరసరావుపేట రూరల్: ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడు మృతిచెందగా, మరోకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన షేక్ ఫయాజ్ (22) కార్పెంటర్ పని చేస్తుంటాడు. సోమవారం సాయంత్రం బాపట్ల జిల్లా కారుమంచి గ్రామంలో వేడుకలకు తన స్నేహితుడు షేక్ మహబూబ్ సుభానీతో కలిసి హాజరయ్యాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో తిరుగు ప్రయాణంలో లక్ష్మీపురం వద్ద ద్విచక్ర వాహనాన్ని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో పట్టణంలోని ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మంగళవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ ఫయాజ్ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ కిశోర్ తెలిపారు.

మందు బాబుల హల్‌చల్

నరసరావుపేట టౌన్: పట్టణంలో మందు బాబులు స్వైర విహారం చేస్తున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా బహిరంగంగా మద్యం సేవిస్తూ హల్‌చల్ చేస్తున్నారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ మద్యం దుకాణంలో యువకుడిపై బీరు సీసాలతో నలుగురు యువకులు పొడిచిన విషయం విదితమే. సంఘటన మరువక ముందే చిత్రాలయ టాకీస్ సెంటర్‌లోని మద్యం దుకాణం వద్ద రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడిపై మందు బాబులు సోమవారం రాత్రి దాడికి తెగబడ్డారు. ఈ వ్యవహారం అక్కడ ఉన్న సీసీ పుటేజ్‌ల్లో నిక్షిప్తమై బయటకు రావటంతో వీడియో వైరల్ అయ్యింది. సంఘటనపై టూటౌన్ పోలీసులను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.


ఈకేవైసీ నూరుశాతం చేయాలి

శావల్యాపురం: వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని సభ్యులు ఈకేవైసీ నమోదు గ్రామసచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో నూరుశాతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పథకాలు సర్వే పురోగతిపై గ్రామసచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యాదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని కారుమంచి, శావల్యాపురం సొసైటీల పరిధిలో 3813 మంది రైతులు ఉన్నారని ఇప్పటి వరకు 2446 మంది రైతుల ఈకేవైసీ చేయగా 1367 మంది రైతులు ఉన్నారని త్వరితగతిన ఈకేవైసీ నమోదు పూర్తి చేయాలని లేని పక్షంలో తగిన కారణాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లోని పదోవ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ద్వారా తయారు చేసిన స్టడీ మెటీరియల్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గంగినేని పౌండేషన్ అధ్యక్షులు గంగినేని రాఘవరావు ఎస్‌పీ రమణమ్మ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వరరమ్మ, దొడ్డా వీరాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో వినుకొండ



వినుకొండ పట్టణం



శివయ్య స్థూపం సెంటరు

- గుర్రంజాషువా వంటి కవులకు పుట్టినిల్లు
- రాయలసీమకు ముఖద్వారం

వినుకొండ(నూజెండ్ల): రావణబ్రహ్మ సీతను లంకకు తీసుకెళ్లే క్రమంలో జటాయువు పక్షి సీతజాడనువిని శ్రీరామునికి తెలిపిన స్థలమే విన్నకొండ రానురాను వినుకొండగా మారిందిని స్థలపురాణం వినుకొండ కొండపైన జరిగిందని భక్తుల విశ్వాసం గుర్రం జాషువా వటికవులు, పులుపుల వెంకటశియ్య వంటి రాజకీయ ఉద్దండులు జీవించిన ఊరుగా వినుకొండ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. 1952లో పులపుల వెంకటశివయ్య వినుకొండకు మొదటి ఎమ్మెల్యేగా సేవలందించారు. రానురాను వినుకొండ ప్రాంతం అభివృద్ధి చెందుతూ వచ్చింది. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటిఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సహాయ సహకారాలతో శరవేగంగా అభివృద్ధి చెందింది. 2019 నుంచి 2024 వరకు రియల్ ఎస్టేట్, పరంగానే కాకుండా విద్యాపరంగా, ఆర్థికపరంగా, అన్నీవిధాలుగా అభివృద్ధి చెందింది. వినుకొండ ఎటు చూసినా 5 కిలోమీటర్ల మేర విస్తరించింది. వినుకొండలో ప్రభుత్వ హాస్పటల్ అభివృద్ధితోపాటు ప్రయివేటు హాస్పటల్స్, ప్రభుత్వ విద్యాలయాలతోపాటు, ప్రయివేటు విద్యాలయాలు, కళాశాలలు, ఆపార్ట్‌మెంట్లు, నూతన రెస్టారెంట్లు, హోటల్స్, షాపింగ్‌మాల్స్ ఏర్పాటయ్యాయి. అలాగే వినుకొండ రైల్వేస్టేషను అభివృద్ధితోపాటు, నడికుడి శ్రీకాళహస్తి నూతన రైల్వేమార్గం కూడా అందు బాటులోకి వచ్చింది. పరిశ్రమల పరంగా కందిపప్పు మిల్లులు, వల్లభ పాల డెయిరీ, వంటి పరిశ్రమలు, బీయిడీ కళాశాలలు, ఐటీఐ కళాశాలలు, గీతాంజలి, గీతమ్స్ వంటి విద్యా సంస్థలు ఎన్నోసేవలు అందిస్తున్నాయి. గుంటూరు-కర్నూలు జాతీయరహదారి వినుకొండ మీదుగా పోతుండటం, శ్రీశైలం, మహానంది, ప్రముఖక్షేత్రాలు వినుకొండమీదుగా వెళుతుండటంతో రాయలసీమ ముఖద్వారంగా పేరుగాంచింది. రానున్న రోజుల్లో వినుకొండ మహానగరంగా అభివృద్ధి చెందుతుందనడంలో సందేహం లేదు.